క్లుప్తంగా

కాలువలకు సమృద్ధిగా సాగునీరు

పెనుమంట్ర: మండల పరిధిలోని ప్రధాన కాలువలకు సమృద్ధిగా సాగునీరు విడుదల చేయడంతో రైతులు నారుమడులకు సమాయత్తమవుతున్నారు. గోస్తనీ పంటకాలువలో నీరు పుష్కలంగా విడుదల కావడంతో బ్రాంచ్ కాలువలకు కూడా శనివారం నుంచి నీరు విడుదల చేయడంతో రైతులు నారుమడులకు సిద్ధమవుతున్నారు. పెనుమంట్ర పరిధిలో భట్లమగుటూరు, నేలపోగుల బ్రాంచ్ కాలువలకు సాగునీటిని పూర్తిస్థాయిలో విడుదల చేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

యువకులకు క్రికెట్ కిట్ అందజేత



యువకులకు క్రికెట్ కిట్ అందజేస్తున్న గుణ్ణం నాగబాబు

పాలకొల్లు సెంట్రల్: యువకులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే ఆటలతోనే సాధ్యమని వైఎస్సార్ పార్టీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు గుణ్ణం నాగబాబు అన్నారు. ఆదివారం స్థానిక పెదపేటకు చెందిన అంబేద్కర్ యువజన క్రికెట్ టీం సభ్యులకు నాగబాబు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు తీవ్రత ఎక్కువగా ఉందని సాయంత్రం సమయంలో వాతావరణం చల్లబడిన తరువాతనే యువకులు ఆటలకు సమయం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుణ్ణం సురేష్, సబ్బితి డింబు, వసంత బాబు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మావుళ్లమ్మ జాతర

పెనుగొండ: సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారు జాము వరకూ గ్రామంలో మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్, ఆలయ నిర్మాణ కమిటీల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గరగల నృత్యాలు, సినీ వనకన్య ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారి నృత్య రూపకం ఆకట్టుకుంది. పరిసర ప్రాంతాలు చెందిన భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. రెండు రోజుల పాటు తీర్థ మహోత్సవం కనుల పండుగగా నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండాఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కేపీ పాలెం బీచ్‌లో సందర్శకుల సందడి

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఎండ విపరీతంగా కాయడంతో పాటు వేడిగాలులు వీస్తుండడంతో పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ సేదతీరారు. అనంతరం తీరంలోని వేంకటేశ్వర స్వామి, వేళాంకణి మాత, పాండురంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని ఆదివారం కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని సబ్‌కలెక్టర్ చెప్పారు. ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని సూచించారు.

వైభవంగా సూర్యహోమం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం 160 సూర్యహోమం నిర్వహించారు. కోవిడ్ నుండి కోలుకుని ప్రజలు ఆరోగ్యకరంగా ఉండాలనే సంకల్పంతో మొదలు పెట్టిన సూర్యహోమం 160వ వారానికి చేరుకుంది. పురోహితులు రవీంద్ర బ్రహ్మత్వంలో పందిటి మోహన్ దంపతులు ఈ సూర్య హోమం నిర్వహించారు. హోమం అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కేవీఎల్ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

బాడవ మాజీ సర్పంచ్ పండుకు మాతృవియోగం



పాపారత్నం (ఫైల్)

యలమంచిలి: వైఎస్సార్ సీపీ నాయకుడు, బాడవ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఇలపకుర్తి నరసింహారావు (పండు) మాతృమూర్తి పాపారత్నం (95) ఆదివారం సాయంత్రం వయోభారంతో మరణించారు. ఆమెకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నాలుగవ కుమారుడు పండు పార్టీలో సీనియర్ నాయకుడు. ఆయన భార్య లక్ష్మీ ప్రస్తుతం కాపు కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. పాపారత్నం మరణవార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ బాడవ వెళ్లి పండు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పేదల ఇంటికే ప్రభుత్వ వైద్యుడు



పూలపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం ఏర్పాటు చేసిన దృశ్యం



లంకలకోడేరు శివారు వెదుళ్లపాలెంలో రోగి ఆరోగ్యంపై ఆరాతీస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవ్య జీవన్



రోగిని పరీక్షిస్తున్న మెడికల్ ఆఫీసర్ డా.పి సత్యసౌజన్య

- గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా వైద్య సేవలు
- దీర్ఘకాలిక రోగులకు మరింత మేలు

పాలకొల్లు అర్బన్: చిన్న చిన్న రోగాలకు సైతం ప్రైవేట్ వైద్యులను సంప్రదించి వేలాది రూపాయలు ఖర్చు చేసుకునే పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం వల్ల ఎంతో మేలు కలుగుతోంది. ప్రభుత్వ వైద్యులు వారానికి రెండు సార్లు గ్రామాల్లోకి వచ్చి పరీక్షలు నిర్వహించి మందులు అందించే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. దీంతో గ్రామాల్లో సుగర్, బీపీ, డెంగీ, మలేరియా, చికున్ గున్యా, పక్షవాతం, గుండె సంబంధిత రోగాలతో బాధపడే రోగులకు ఈ శిబిరాలవల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

ఉదయం ఎనిమిది నుంచి సేవలు

ప్రతి గ్రామంలోను నెలకి రెండు సార్లు డా. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యుడు, ఏఎన్ఎం, ఫార్మాసిస్ట్, డీఈవో, ఆశ వర్కర్లు రోగులకు సేవలందించి మందులు ఉచితంగా అందిస్తున్నారు.

14 రకాల రక్త పరీక్షలు ఉచితం

హిమోగ్లోబిన్, ఆర్‌బీఎస్ (ర్యాండమ్ బ్లడ్ సుగర్), డెంగీ, మలేరియా, హెచ్‌ఐవీ, హెచ్‌బీసాగ్ (వైరల్ స్క్రీనింగ్ పరీక్షలు), గర్భ నిర్ధారణ, కళ్లె పరీక్ష (టీబీ టెస్ట్), వాటర్ క్లోరినేషన్, అయోడిన్ సాల్ట్ టెస్ట్, హిమోగ్లోబిన్ స్ట్రాటీన్, లూకో సైట్ అండ్ స్టాచ్ గ్లోకోజ్, ఫైలేరియా, అసిటాక్ యాసిడ్ వంటి 14 రకాల రక్త పరీక్షలు నిర్వహించి 67 రకాల మందులు ఉచితంగా అందిస్తున్నారు.

శిబిరం నిర్వహణ ఇలా...

ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం వంటి గంట వరకు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వద్ద ఉండి రోగులను పరీక్షించి అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు. అలాగే మధ్యాహ్నం 2గంటల నుంచి ఆ గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లల ఆరోగ్య పరిస్థితి, ఎదుగుదల, రక్తహీనత, పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి వారికి పౌష్టికాహారం అందించేందుకు సూచనలు చేస్తున్నారు. అలాగే పక్షవాతం, గుండె, కిడ్నీ, ఇతర సంబంధిత దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని సలహాలు, సూచనలు చేస్తున్నారు.

మే నెలలో నిర్వహించిన క్యాంపులు ఇలా

మండలం	క్యాంపులు	పరీక్షించిన రోగులు
పాలకొల్లు	26	8630
పోడూరు	26	5811
యలమంచిలి-1	26	6553
యలమంచిలి-2	26	4730

పాలకొల్లు మండలంలో ఫ్యామిలీ ఫిజీషియన్ షెడ్యూల్ ఇలా

అరట్లకట్ట	1వ గురువారం	3వ శుక్రవారం
బల్లిపాడు	1వ శుక్రవారం	3వ శనివారం
ఆగర్రు	1వ శనివారం	4వ సోమవారం
చింతపర్రు	1వ శనివారం	4వ సోమవారం
పూలపల్లి	1వ బుధవారం	3వ గురువారం
దగ్గులూరు	2వ సోమవారం	4వ మంగళవారం
గవరపేట	2వ మంగళవారం	4వ బుధవారం
భగ్గేశ్వరం	2వ శుక్రవారం	4వ శనివారం
ఎస్ చిక్కాల	2వ శుక్రవారం	4వ శనివారం
ఆగర్తిపాలెం	2వ సోమవారం	4వ మంగళవారం
తిల్లపూడి	2వ శనివారం	4వ సోమవారం
లంకలకోడేరు	2వ గురువారం	4వ శుక్రవారం
కాపవరం	2వ బుధవారం	4వ గురువారం
వెలివెల	3వ సోమవారం	4వ సోమవారం

ఇంటి వద్దే పరీక్షలు



నాది పూలపల్లి గ్రామం. ఇస్త్రీ పని చేసుకుని ఉపాధి పొందేవాడిని. నేను సుగర్ వ్యాధితో బాధపడుతున్నాను. గతంలో 104 వాహనం గ్రామంలోకి వచ్చినప్పుడు సుగర్ బిల్లలు వాడేవాడిని. పవర్ సరిపోలేదు. గత నెలలో నా కాలికి శస్త్ర చికిత్స చేసి మోకాలి కింది భాగం వరకు తొలగించారు. ప్రస్తుతం బాగానే ఉంది. ప్రభుత్వ వైద్యులు ఇంటికి వచ్చి నా ఆరోగ్య పరిస్థితిని చూసి వెళుతున్నారు. అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

– సోంపల్లి వెంకటస్వామి, పూలపల్లి

దీర్ఘకాలిక రోగులను పరీక్షిస్తున్నాం



లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 14 గ్రామాల్లో ప్రతీ నెలా రెండు సార్లు సందర్శించి వైద్య సేవలు అందిస్తున్నాం. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి పరీక్షలు చేసి ధైర్యం చెబుతున్నాం.

– డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్, మెడికల్ ఆఫీసర్

పేదల కాలనీ పూడికలను అడ్డుకున్న ఎమ్మెల్యే నిమ్మల



చిట్టూరి కనకలక్ష్మి, ఎంపీపీ

పాలకొల్లు అర్బన్: గోదావరి పరీవాహక పెరుగులంక భూముల్లోని మట్టిని జగనన్న కాలనీలకు తరలిస్తుంటే ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అడ్డుపడి రాజకీయం చేయడం సిగ్గుచేటని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఎంపీపీ ఒక ప్రకటన విడుదల చేశారు. చించినాడలో 60 ఏళ్ల పాలించిన సీపీఎంకు అక్కడ ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. అలాగే ఎమ్మెల్యే నిమ్మల రానున్న ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుని తన ఉనికిని కాపాడుకోవడం కోసం వామపక్షాలతో కలిసి రాద్ధాంతం చేస్తున్నారని దుయ్యబట్టారు. జగనన్న కాలనీ పూడికలకు అడ్డుపడుతున్న ఎమ్మెల్యే నిమ్మల దురాగతాలను పేదలు గమనిస్తున్నారని హెచ్చరించారు. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో మట్టి తరలిస్తుంటే రోజుకో డ్రామాతో ప్రజల్లో గందరగోళం సృష్టించి పబ్బం గడుపుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నా రని దుయ్యబట్టారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పాలకొల్లులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేయడం ఖాయమని ఎంపీపీ కనకలక్ష్మి ధీమా వ్యక్తం చేశారు.

జేఈఈలో విద్యార్థుల ప్రతిభ



సాయి సత్య

పెనుగొండ: జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ ఫలితాల్లో పెనుగొండ మండల విద్యార్థులు ప్రతిభను కనబరించారు. పెనుగొండ మండలం ములపర్రు పితాని వారి పాలెంకు చెందిన తణుకు డిగ్రీ కళాశాలలో బోటనీ అధ్యాపకుడు పితాని శ్రీనివాసరావు, శ్రీలక్ష్మీ దుర్గల కుమారుడు పితాని మోహిత్ సాయి సత్య ఆలిండియా 2287 ర్యాంకు సాధించి ఓబీసీ విభాగంలో 391 ర్యాంకుతో ప్రతిభను చాటాడు. సైంటిస్ట్ గా స్థిరపడాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు మోహిత్ తెలిపారు. పెనుగొండకు చెందిన పిండి నాగేశ్వరరావు, సుజాతల దంపతుల కుమార్తె పిండి హేమ నాగ మణి ఆలిండియా 15847 ర్యాంకు సాధించి, ఈడబ్ల్యూఎస్ విభాగంలో 2324 ర్యాంకుతో నిలిచారు. పెనుగొండకు చెందిన కంబాల వెంకటేశ్వరరావు, మహాలక్ష్మీ నాగ వెంకట దుర్గ కుమారుడు కంబాల చంద్రశేఖర్ 21882 ర్యాంకుతో ఈడబ్ల్యూఎస్ విభాగంలో 3422 ర్యాంకుతో నిలిచారు.

హైఓల్టేజ్‌తో గృహోపకరణాలు దగ్ధం

నరసాపురం: పట్టణంలోని 11వవార్డులో ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో విద్యుత్ హై ఓల్టేజ్ కారణంగా పలు ఇళ్లలో షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు బూడిదయ్యాయి. 10 ఇళ్లలో ఏసీలు, 25 ఇళ్లలో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, 10 ఇళ్లలో ఫ్రిజ్‌లు కాలిపోయాయి. కొన్ని ఇళ్లలో మంటలు కూడా రావడంతో జనం భయభ్రాంతులకు లోనయ్యారు. వార్డులోని వెలంపేట, ద్వారావారి వీధి రెండు ప్రాంతాల్లోని ఇళ్ల ప్రమాదానికి లోనయ్యాయి. వార్డులో తరచూ ఇలానే జరుగుతుందని విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రాధాన్యం



మేడపాడులో వాటర్ ట్యాంకు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: జగనన్న ప్రభుత్వంలో నవత్నాల పేరిట పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. మేడపాడులో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.40 లక్షలతో నిర్మిస్తున్న అదనపు వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగేళ్లలో అవినీతి, సిఫారసులకు అవకాశం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత మన ప్రభుత్వానిదన్నారు. అదే సమయంలో సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి ప్రజలకు ప్రభుత్వ సేవలు త్వరగా అందుకునేలా చేసిన ఘనత కూడా జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ విషయాలను ప్రజలకు గుర్తు చేసి వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో మరొకసారి జగనన్నను ముఖ్యమంత్రిగా ఎన్నుకునేలా ప్రజలకు ఉత్తేజపరిచే బాధ్యత సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు తీసుకోవాలని ఆయన కోరారు. వచ్చే ఎన్నికల నాటికి ప్రస్తుతం జరుగుతున్న పనులన్నింటినీ పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానని శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, సర్పంచ్ గంటా శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ ఉప సర్పంచ్ ముద్దల శ్రీనివాస్ నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, గంధం సత్యకీర్తి, దేగల వెంకటేశ్వరరావు, అడబాల రామ్మోహనరావు, గాది వరదయ్య, బాలం అంజిబాబు, వర్ధనపు వెంకటేశ్వరరావు, కుక్కల సుబ్బారావు, కుక్కల ఆంజనేయులు, కుక్కల సూరయ్య, కుక్కల బాలచంద్రన్, ఉండ్రాజవరపు ఆంజనేయులు పాల్గొన్నారు.

కష్టించి పనిచేసే కార్యకర్తలకు న్యాయం



కొవ్వూరి వేణు మాధవరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీలో కష్టించి పని చేసే కార్యకర్తలకు, నాయకులకు గుర్తింపు లభిస్తుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మార్టేరుకి చెందిన కొవ్వూరి వేణుమాధవరెడ్డి ఆదివారం పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వేణుమాధవరెడ్డి భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని అభినందించారు. ఆయనతో పాటు పోడూరు ఎంపీపీ సబ్బితి సుమంగళి, పార్టీ నాయకులు మేడపాటి చంద్రమౌళిరెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వెంకటాపురం గ్రామానికి వేగేశ్న సుబ్రహ్మణ్యంరాజు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ శ్రీనివాస్ పరామర్శించారు. మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు తదితరులు రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే చింతపర్రు మాజీ సర్పంచ్ వీరమల్లు దుర్గా రాజరాజేశ్వరరావు సంవత్సరీకం కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్ పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రైల్వే గేటుతో ప్రయాణికుల ఇక్కట్లు



రైల్వే గేటు వద్ద గేటు వేసే సమయంలో ట్రాఫిక్ సమస్య



రైల్వే స్టేషన్‌కు ఈశాన్యం వైపున ఉన్న మార్గం ఓపన్ చేయాలని కోరుతున్న ప్రయాణికులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు ఒక్క పాలకొల్లు చుట్టుపక్కల పరిసరా ప్రాంతాల నుంచే కాకుండా దాదాపుగా 50 కి.మీటర్ల దూరం నుండి ప్రయాణికులు ఇక్కడకు వచ్చి రైలు ప్రయాణం చేస్తుంటారు. దానితో రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే లాకు సెంటర్ నుండి ట్రాఫిక్‌తో ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. పాలకొల్లుకు ఉమ్మడి తూర్పుగోదావరి అయిన కోనసీమ జిల్లా అమలాపురం, రాజోలు, పశ్చిమగోదావరి జిల్లాలో ఆచంట నియోజకవర్గాల నుండి ప్రయాణికులు పాలకొల్లు రైల్వే స్టేషన్‌కు వస్తుంటారు. ఈ ప్రాంతాల్లో ఎక్కడ నుండి రావాలన్నా సుమారు 20 నుండి 50 కి.మీటర్లు దూరం ఉంటుంది. ప్రతీరోజు తెల్లవారుజామున 3.30 గంటల నుండి రాత్రి 12.40 గంటల వరకూ సుమారు 12 ట్రైన్‌లు వెళుతుంటాయి. ముఖ్యంగా మధ్యాహ్నం 11.25 గంటల సమయంలో నాగర్‌సోల్, సాయంత్రం 5.50 గంటలకు తిరుపతి (ధర్మవరం), రాత్రి 7 గంటల సమయంలో సికింద్రాబాద్ (లింగంపల్లి) ఈ మూడు రైళ్ల సమయాల్లో మాత్రం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

గేటుదాటడమే కష్టం

ఒక్కోసారి గేటు వేసిన తరువాత వచ్చే ప్రయాణికులు అత్యంత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గేటు వేయడం వల్ల ట్రాఫిక్ ఆగిపోతుంది. దానితో ఆ సమయంలో హడావుడిగా వచ్చే రైల్వే ప్రయాణికులు స్టేషన్ రోడ్డులోకి వెళ్లడానికి వాహనాలు అడ్డం ఉండడంతో ట్రైన్ మిస్ అయ్యే సందర్భాలు అనేకం ఉన్నాయి. దీనివల్ల రైల్వేస్టేషన్‌కు వెళ్లడానికి మరో మార్గం ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. పోడూరు మండలం, పాలకొల్లు మండలంలోని వడ్లవానిపాలెం రోడ్డున వచ్చే ప్రయాణికులు వడలవానిపేట రోడ్డు నుండి స్టేషన్‌కు చేరుకోవడానికి మార్గం ఉంది. అలాగే ప్రస్తుతం పాలకొల్లు మండలంలోని పూలపల్లి నుండి శివదేవుని చిక్కాల ప్రాంతం నుండి వచ్చే ప్రయాణికులు భీమవరం రోడ్డు నుండి వస్తుంటారు. అలాగే వారికి ఎఫ్‌సీఐ గోడౌన్ నుంచి మరో మార్గం కూడా ఉంది. లాకు సెంటర్ నుండి రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులే ఎక్కువ ఇబ్బందులకు గురవుతున్నారు. అంటే కోనసీమ జిల్లా నుండి వచ్చే ప్రయాణికులు, పట్టణ వాసులు, ఆచంట నుండి వచ్చే ప్రయాణికులకే ఎక్కువ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఒక్కోసారి గాంధీబొమ్మల సెంటర్ నుండి లాకు సెంటర్ వరకూ ట్రాఫిక్ ఆగిపోతుండడంతో ఈ సమస్య మరింత జటిలమవుతుంది.

ప్రత్యేక రోడ్డు ఉన్నా

పట్టణంలోని కొందరు ప్రముఖులు రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి మరో మార్గం చూపిస్తే బాగుంటుందని సలహా ఇస్తున్నారు. ఈ మార్గం కూడా ప్రస్తుతం ఉన్న పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న బీఆర్ఎంవీ మునిసిపల్ హైస్కూల్ రోడ్డు నుంచి బ్రహ్మానందరెడ్డి కాలనీ మీదుగా గూడ్స్ షెడ్ రోడ్డు ఉంది. ఈ రోడ్డు రైల్వేస్టేషన్‌కు ఈశాన్యం మూలకు వస్తుంది. అలాగే సైకిల్ పార్కింగ్ ఏర్పాటు చేసే రోడ్డు ఉంది. వీటిని అభివృద్ధి చేస్తే రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి మార్గం సులభంగా ఉంటుంది. అలాగే ట్రాఫిక్ సమస్య కూడా లేకుండా ఉంటుంది. గూడ్స్ షెడ్ రోడ్డు మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగులు ఉందని స్థానికులు చెపుతున్నారు. ఈ రోడ్డును అభివృద్ధి చేస్తే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఉంటుంది.

పరిష్కారానికి చర్యలు



ట్రాఫిక్ ఇబ్బందులు వల్ల రైల్వే ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. పట్టణంలో గుత్తులవానిపేట బీఆర్ఎంవీ స్కూల్ రోడ్డు నుండి రైల్వే స్టేషన్‌కు మార్గం ఇవ్వాలని కోరుతున్నారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసు అధికారులతో చర్చించి సమస్య పరిష్కారం కొరకు కృషి చేస్తాం.

– బీఆర్ఎస్ శేషాద్రి, మునిసిపల్ కమిషనర్, పాలకొల్లు

ట్రాఫిక్‌తో సమస్య



రైల్వే సమయం వచ్చే సరికి స్కూల్, కళాశాల బస్‌లు వదలడం, అన్ని ప్రాంతాల నుండి ఒకేసారి ప్రయాణికులు రావడం, వ్యాపార సంబంధ వాహనాలతో ట్రాఫిక్‌తో కొంత సమస్య ఏర్పడుతుంది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రతీ సర్కిల్‌లో కానిస్టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. స్టేషన్ ఎదురుగా ఉన్న బీఆర్ఎంవీ స్కూల్ నుంచి రైల్వే స్టేషన్‌కు మార్గం ఏర్పాటు చేస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు. .దీనిపై ఒకసారి ట్రాఫిక్ నిబంధనలు పరిశీలించి ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాము.

– దారావత్తు రాంబాబు, పట్టణ సీఐ, పాలకొల్లు

త్వరలో కమిటీ



ఈ సమస్యపై పట్టణంలోని కొందరు ప్రముఖులు, అధికారులు నాకు ఒక రిప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. దీనిపై ఇటీవల విజయవాడలో జరిగిన డీఆర్‌యూసీసీ సమావేశంలో డివిజినల్ రైల్వే మేనేజర్‌తో చర్చించాం. ఈ సమస్యపై త్వరలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తాం. కమిటీ వచ్చి ఇచ్చిన రిపోర్టు మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– జక్కంపూడి కుమార్, రైల్వే డీఆర్‌యూసీసీ మెంబర్, పాలకొల్లు